బస్తీ బాధలు పట్టవాయే!

- వీకర్‌సెక్షన్ కాలనీలో సమస్యల లొల్లి
- లోప్రెషర్ తాగునీటి సరఫరా
- రోడ్లపై మురుగు పరుగు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


వీకర్ సెక్షన్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

మన్సూరాబాద్: మురికివాడల్లో నివసించే పేదలకు వసతులు కల్పించాలంటే పాలకులకు, అధికారులకు చిన్నచూపు. మన్సూరాబాద్ డివిజన్ వీకర్‌సెక్షన్ కాలనీలో నివసించే ప్రజలు అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ మురుగు పొంగిపొర్లుతోందని, తాగునీరు లో ప్రెషర్‌తో సరఫరా అవుతోందని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన ఉండటం లేదని బస్తీవాసులు వాపోతున్నారు.

- 1986లో సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన 150పైగా పేద కుటుంబాలకు అప్పటి ఎన్టీఆర్ ప్రభుత్వం స్థలాలను కేటాయించి, ఇళ్ల నిర్మాణం చేపట్టింది.
- ప్రభుత్వం గుర్తించిన మురికివాడగా వీకర్‌సెక్షన్ కాలనీ అధికారిక రికార్డుల్లో ఉంది. నాటి నుంచి నేటి వరకు వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు.
- నాటి జనాభాకు అనుగుణంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను నేటి జనాభా మేరకు అభివృద్ధి చేయకపోవడంతో బస్తీలో డ్రైనేజీలు పొంగి మురుగు నీరు రోడ్లపై పారుతోంది.
- మంచినీరు నిత్యం లోప్రెషర్‌తో సరఫరా అవుతోందని, తరచూ తాగునీటిలో మురుగునీరు కలిసి కలుషిత నీరు సరఫరా అవుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.
- బస్తీ అవసరాల కోసం వదలిన స్థలాలు అన్యాక్రాంతం కావటంతో బస్తీవాసులు సేద తీరేందుకు పార్కు, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం లేకుండాపోయింది.
- నాడు నల్లా నీరు ఉచితమని చెప్పి పాలకులు.. నేడు పాత బకాయిలతో సహా బిల్లులు వేసి చెల్లించాలని నోటీసులు, మెసేజ్‌లు పంపుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. .

నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

బస్తీవాసుల తాగునీటి అవసరాల దృష్ట్యా సుమారు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉంది. వాటర్ ప్లాంట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పవర్‌బోరు పనిచేయటం లేదు. వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని బస్తీవాసులు కోరుతున్నారు.

వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతు చేపట్టాలి



బస్తీలో తాగునీటి సమస్య ఉంది. దీనిని పరిష్కరించేందుకు నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలి. బస్తీ అవసరాల దృష్ట్యా వదిలిన పార్కు, ఆటస్థలాలు నేడు అన్యాక్రాంతమయ్యాయి. బస్తీకి ఆనుకొని ఉన్న కాస్మోపాలిటన్ కాలనీ పార్కులోకి మా బస్తీవాసులను అనుమతించే విధంగా గోడకు గేటును ఏర్పాటు చేయాలి.

– కాసాని అశోక్‌యాదవ్, వీకర్ సెక్షన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

లోప్రెషర్‌తో ఇబ్బందులు



బస్తీలో లోప్రెషర్‌తో మంచి నీటి సరఫరా అవుతోంది. డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతోంది. ఈ సమస్యలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు. ప్రతి ఇంటికీ 20వేల లీటర్ల తాగునీరు ఉచితంగా అందజేస్తామని చెప్పిన అధికారులు .. నేడు బిల్లులు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి.

– పి. ప్రభావతి, వీకర్‌సెక్షన్ కాలనీవాసి

తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అనితానాయక్, ఇతర అధికారులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట మార్కెట్‌లోని వ్యాపారులు తమ దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ సూచించారు. శనివారం ఆమె మార్కెట్ కార్యాలయంలో చాదర్‌ఘాట్ పోలీసులు, వ్యాపారులు, డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్కెట్‌లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం వ్యాపారులు పోలీసుల సూచనలను పాటించాలన్నారు. మార్కెట్‌లో చోరీల నివారణతో పాటు మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, రైతుల భద్రతకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ఆమె అన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన


ఎల్‌ఐసీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: మురుగునీరు రహదారులపై పారకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లో పూడికతీత పనులు నిర్వహించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎల్‌ఐసీ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ స్థానికుల ద్వారా సమస్యను తెలుసుకొని వాటర్‌వర్క్స్ సిబ్బందిని అక్కడికి రప్పించి డ్రైనేజీల్లో పూడిక తీయించారు. అనంతరం ఎస్‌బీహెచ్ కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. కమ్యూనిటీహాల్‌లో విద్యుత్ వైరింగ్ పనులు కూడా పూర్తి చేసి విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ అల్తాఫ్, అనురాధ, కార్తీక్, అరుంధతి, ప్రసాద్, రమేష్, సాయి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని తన కార్యాలయంలో శనివారం ఆయన సైదాబాద్ మండలానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ హరిబాబు, ఎంఐఎం నాయకులు ఉన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

బావి స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి అప్పగించాలి: రాజిరెడ్డి


బావి స్థలం రిజిస్ట్రేషన్ సేల్ డాక్యుమెంట్లను చూపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చంపాపేట: చంపాపేట డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ప్రభుత్వ స్థలం స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి స్వాధీనంలో ఉందని, ఆ స్థలాన్ని వెంటనే జీహెచ్‌ఎంసీకి అప్పగించి తన చిత్తశుద్ధిని ప్రదర్శించుకోవాలని డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి హితవు పలికారు. శనివారం కర్మన్‌ఘాట్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత లక్ష్మీనగర్ కాలనీ ప్రధాన రహదారి సమీపంలో వంగ ధర్మారెడ్డికి చెందిన సర్వే నం. 24, 25 భూమిలో పెద్ద మంచినీటి బావి ఉండేదని, ఆ బావి నుంచే కర్మన్‌ఘాట్ ప్రాంతవాసులకు తాగునీరు సరఫరా అయ్యేదని రాజిరెడ్డి తెలిపారు. 1983లో కర్మన్‌ఘాట్ గ్రామ పంచాయతీ నిధులు రూ. 79 వేలతో 452 గజాల బావి స్థలాన్ని ధర్మారెడ్డి వద్ద కొనుగోలు చేసి గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి తన తండ్రి ధర్మారెడ్డి గ్రామ పంచాయతీకి విక్రయించిన ఆ బావి స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని కారు మెకానిక్ షెడ్‌కు కిరాయికి ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మధుసూదన్‌రెడ్డి ఆ స్థలంలో మినీ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసి తన చిత్తశుద్ధిని ప్రదర్శించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, మల్లేష్‌గౌడ్, సుర్వి పెంటయ్య, చీర తిరుమలేష్, శ్రీను, చందు, శివ, జగదీష్‌గౌడ్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి 'మన్ కీ బాత్'కు చైతన్యపురిలో ఏర్పాట్లు

చైతన్యపురి: ప్రజలతో నిరంతరం సంప్రదింపులు జరిపి తన మనసులోని భావాలను వ్యక్తీకరించటానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారం 100వ ఎపిసోడ్ ప్రసారమవుతుందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ తెలిపారు. శనివారం వారు చైతన్యపురిలో విలేకరులతో మాట్లాడుతూ, మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు చైతన్యపురిలోని భాగ్యశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లు చేశామన్నారు. సుమారు 2 వేల మందికి పైగా పాల్గొంటారని అన్నారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు రంగానర్సింహ గుప్తా, పవన్‌కుమార్, బీజేపీ నాయకులు చింతల సురేందర్‌యాదవ్, మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా, రుద్రారపు శంకర్, జయప్రకాష్, వినోద్ యాదవ్, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

నేడు బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ మధురాపురిలోని స్వర్ణకార వీధిలో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 330 వ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నామని విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి, ప్రధాన కార్యదర్శి తుడిమళ్ల లవకుమార్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు నిర్వహించే ఆరాధనోత్సవాల్లో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్ పాల్గొంటారన్నారు.

మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా రెండు రోజులు సెలవులు ఉంటాయని మార్కెట్ గ్రేడ్–3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మార్కెట్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 30 ఆదివారం, మే1న మార్కెట్ బంద్ ఉంటుందని చెప్పారు. తిరిగి మంగళవారం నుంచి మార్కెట్‌లో కార్యాలాపాలు యథావిధిగా సాగుతాయన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి మధురానగర్ కాలనీకి చెందిన నర్రి సాయిచరణ్ మూత్రపిండాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించుకున్న ఇతను ఎమ్మెల్యే సిఫార్సుతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును లబ్ధిదారుడి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శనివారం అందిజేశారు. బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేసిన కార్పొరేటర్

హస్తినాపురం: డివిజన్‌లోని పింగినారాయణరెడ్డి కాలనీ ఫేజ్–2కి చెందిన ఎం.అఖిల కుమార్తె వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.54 వేలు మంజూరయ్యాయి.ఇందుకు సంబంధించిన చెక్కును డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ లబ్ధిదారుకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, రమేశ్‌చారి, పద్మ, లింగాచారి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక కుటుంబానికి పరామర్శ


మౌనిక భౌతికకాయాన్ని సందర్శించిన నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: సికింద్రాబాద్ కళాసీగూడలో నాలాలో పడి మృతి చెందిన బాలిక మౌనిక కుటుంబాన్ని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పార్టీకి పాలనపై సరియైన శ్రద్ధ లేకపోవడంతో వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో నాలాలో బాలిక పడి మృతి చెందడం బాధాకరమన్నారు. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకోకుండా గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. రామాలయం, కృష్ణతులసినగర్‌లలో శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్డు తవ్వి ఐదు నెలలు దాటినా నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కృష్ణతులసినగర్ వాసులు అధికారులకు తెలియజేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయని, పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డును పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాలయం నుంచి ఆరోరా కాలేజీ వరకు సీసీరోడ్డు, డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని కోరారు. క్రాంతి బార్ వద్ద వాహనాల అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలని ట్రాఫిక్ పోలీసులకు విన్నవించారు. అనంతరం అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. నోడల్ ఆఫీసర్ బస్సీలాల్, జలమండలి ఏఈ చంద్రునాయక్, మహిళా ఎస్సై శృతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చేయండి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో సమస్యలు లేకుండా చేయాలని డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. శనివారం కొత్తపేట డివిజన్ శివగంగ కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కాలనీల్లో పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ కాలనీలోని రోడ్డు, డ్రైనేజీ, శానిటైజేషన్, తాగునీరు, దోమలు, కుక్కల బెడద వంటి సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏఈ మాత్య నాయక్, ఎల్‌బీనగర్ ఎస్‌ఐ మధుతో కలిసి కాలనీలో పర్యటించారు. ఆ తర్వాత భరత్ నగర్ ఫేస్ 2లో ట్రంక్ లైన్ నాలాలోని మట్టిని కార్పొరేటర్ దగ్గర ఉండి తీయించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అంబాల మల్లేష్, సుబ్బారావు, వాటర్ వర్క్స్ అధికారులు ఆరిఫ్, లక్ష్మయ్య, విజయ భారతి, అఖిల్, కాలనీ వాసులు సంగీత పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఉప్పల ఫౌండేషన్ ఆర్థిక సాయం

నాగోలు: పేద విద్యార్థులకు ఉప్పల ఫౌండేషన్ చేయూతనందిస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బండ్లగూడకు చెందిన పేద విద్యార్థి ప్రసన్నకుమార్‌కు ఎంబీబీఎస్ ఇంటెన్సివ్ ఫీజు నిమిత్తం శనివారం ఆయన ఉప్పల ఫౌండేషన్ నుంచి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నాలా పూడిక తీత పనులు వేగవంతం చేయండి

దిల్‌సుఖ్‌నగర్: రాబోయే వర్షం కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలాల్లో పూడిక తీత పనులు వేగంగా పూర్తి చేసి డ్రైనేజీ లైన్లలో మురుగునీరు సాఫీగా ముందుకు వెళ్లేలా చూడాలని ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని పలు కాలనీల్లో జరుగుతున్న మ్యాన్‌హోళ్ల పూడిక తీత పనులను పరిశీలించారు. కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఇప్పటి నుంచే పూడిక తీయాలన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ దిల్‌సుఖ్‌నగర్ సత్తా



సాక్షి,సిటీ బ్యూరో: జేఈఈ మెయిన్స్–2023 ఫలితాల్లో నారాయణ దిల్‌సుఖ్‌నగర్ డే డివిజన్ సత్తా చాటింది. జాతీయ స్థాయిలో 5వేల లోపు 55 మంది, పది వేల లోపు 91 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరీల్లో ధీరజ్ 15వ ర్యాంక్, మనోహర్ 53, కుశ్వంత్ రెడ్డి 63, సృజన్ రాజ్ 65, నాగసాయి 99 ర్యాంకు సాధించారు. విజయం సాధించిన విద్యార్థులకు, అందుకు కృషి చేసిన అధ్యాపకులను కోర్ డీన్ రాధాకృష్ణ, డీజీఎం రాజు, డీన్ అమరేందర్, ఏజీఎం గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ జగదీష్, శ్యాంసుందర్ రెడ్డి, రవీందర్, దామోదర్ రెడ్డి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బాక్స్ డ్రెయిన్ పనుల్లో ఆలస్యంపై కార్పొరేటర్ ఆగ్రహం

సైదాబాద్: గతేడాది వర్షాకాలం లోపు పూర్తి కావల్సిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు ఈ సంవత్సరం వర్షాకాలం వచ్చేవరకు కూడా పూర్తి చేయరా అంటూ ఎస్‌ఎన్‌డీపీ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కార్పొరేటర్ డివిజన్ పరిధిలో వరద ముంపు నివారణ కోసం సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి శంకేశ్వరబజార్ మసీదు చౌరస్తా వరకు నిర్మిస్తున్న బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులను ఎస్‌ఎన్‌డీపీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సుమారు రూ.10కోట్ల వ్యయంతో 2022 జనవరిలో ఆరు నెలల్లో పూర్త య్యే లక్ష్యంతో ప్రారంభమైన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు 15 నెలలు గడిచినా ఇంకా పూర్తిచేయరా అని కార్పొరేటర్ వారిని ప్రశ్నించారు. నిర్మాణ పనుల కోసం తీసిన భారీగుంతలు చిన్నపాటి వర్షం కురిసినా పూర్తిగా నిండి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, పనులను ఎప్పటికప్పుడు ఎస్‌ఎన్‌డీపీ అధికారులు పర్యవేక్షించాలని ఆమె అన్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు నెలరోజుల్లో పూర్తి చేయాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని కార్పొరేటర్ వారిని హెచ్చరించారు. నెల రోజుల్లో కచ్చితం పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ కృష్ణయ్య, డీఈ వెంకట్ కిరణ్, డీసీ నర్సింహా, ఈఈ బసవరాజు, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

'కామినేని'లో అరుదైన శస్త్రచికిత్స

మన్సూరాబాద్: పొత్తికడుపు నుంచి తొడ వరకు విస్తరించి ఉన్న రక్తనాళాలు ఉబ్బి తీవ్ర నొప్పితో బాధపడుతున్న వృద్ధుడికి ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి నూతన జీవితాన్ని అందించారు. హాస్పిటల్‌లో శనివారం వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడకు చెందిన పోన్నయ్య (73) పొత్తికడుపు ఉబ్బి తీవ్రమైన నొప్పితో బాధపడుతూ నగరంలోని పలు హాస్పిటల్స్‌లో చికిత్స పొందాడు. గ్యాస్ట్రిక్ సమస్యగా నిర్ధారిస్తూ చికిత్స చేసినప్పటికీ నయం కాలేదు. దీంతో అతను ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌లో పరీక్షించుకున్నాడు.రోగికి అరుదైన అబ్డోమెన్ సీటీ స్కాన్ పరీక్ష చేసిన వైద్యులు రోగికి పొత్తి కడుపు దిగువన ఉన్న నాళాలు ఉబ్బినట్లు గుర్తించారు. రక్తప్రవాహానికి కొత్త మార్గం సృష్టించేందుకు ప్రత్యేకంగా నిటినాల్ మెటల్, పాలిస్టర్ ఫాబ్రిక్‌తో తయారు చేయించిన స్టెంట్‌లను వేసి అందుబాటులో ఉన్న నూతన మాగ్నెటిక్ వైర్లు, సాంకేతికను ఉపయోగించి ఎండోవాస్కులర్ ప్రకియతో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కామినేని హాస్పిటల్స్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఆర్ఎంఆర్ బాబు మార్గదర్శకత్వంలో శస్త్రచికిత్సను నిర్వహించినట్లు సీనియర్ కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ రాజేష్ దేశ్‌ముఖ్, డాక్టర్ విశాల్ ఖాంటే, సీనియర్ కార్డియాలజిస్ట్ రవికాంత్, సాగర్ భూయార్, కార్డియాక్ అనస్థీయాలజిస్ట్ సురేష్‌కుమార్, స్మృతి వివరించారు.



అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలేవి?: రాంరెడ్డి


హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న రాంరెడ్డి

చైతన్యపురి: అవినీతి ఎమ్మెల్యేల చిట్టా తన దగ్గర ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారని, అలాంటి ఎమ్మెల్యేలపై చర్యలు ఎందుకు తీసుకోలేదో స్పష్టం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం గడ్డిఅన్నారం డివిజన్‌లో బద్దుల వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద దళితులకు దళిత బంధు పథకం ద్వారా ఉపాధి కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి.. దళితుల దగ్గరే లంచాలు తీసుకుంటున్న ఎమ్మెల్యేలు, వారి అనుచరులపై చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు చెరువులను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. జీఓ 56, 58 కింద కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేదలకు భూములు ఇస్తే, ఎమ్మెల్యే తన అనుచరులు వాటిని లాక్కుంటున్నారని అన్నారు. నాయకులు గోవర్ధన్, వేణుయాదవ్, సురేష్, శ్రీనివాస్, గౌస్‌పాషా, విజయ్, రాజు, శ్రీను, నాగరాజు, లక్ష్మీనారాయణ, శ్యాం, శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గొలుసు దొంగల అరెస్టు

- 3 తులాల పుస్తెలతాడు, బైక్, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఇద్దరూ పాతనేరస్తులు

హస్తినాపురం: గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బాలాపూర్ మండల పరిధిలోని మల్లాపూర్ బాలాజీనగర్ కాలనీకి చెందిన పులిమామిడి కురుమూర్తి (24), బాలాపూర్ మండలం మల్లాపూర్ ఇంద్రానగర్ కాలనీకి చెందిన నెనావత్ గణేశ్ (24) ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు నేరాల బాట పట్టారు. ఇదిలా ఉండగా, ఈనెల 26న వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కిడి రాంరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పి.రాజేశ్వరి(29) రాత్రి 9 గంటల సమయంలో ఒంటరిగా రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని యువకులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని పారిపోయారు. అదేరోజు రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం రాత్రి పాతనేరస్తులైన గణేశ్, కురుమూర్తి అనుమానంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారు. గతంలో వనపర్తిలో ఒక హత్యకేసులో వీరిద్దరూ నిందితులుగా ఉన్నారని , గణేశ్ గతంలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో జరిగిన మొబైల్ చోరీ కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు. శనివారం ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడు, బజాజ్ పల్సర్‌బైక్, రెండు సెల్‌పోన్లు, స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'ఎంజీ కామెట్ ఈవీ' కారు విడుదల


కారును విడుదల చేస్తున్న నటి దక్ష నగర్కర్

లక్డీకాపూల్: ఎంజీ మోటార్ ఇండియా రూపొందించిన స్మార్ట్ ఎలక్ట్రికల్ వాహనాలు నగరంలో అందుబాటులోకి వచ్చాయి. ఎంజీ మోటార్స్ అథరైజ్డ్ డీలర్ పీపీఎస్ మోటార్స్ మార్కెట్‌లోకి ఎంజీ కామెట్ ఈవీ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. శనివారం ఎల్బీనగర్‌లోని పీపీఎస్ షోరూమ్‌లో జరిగిన ఈ వేడుకలో నటి దక్ష నగర్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంజీ మోటార్ ఎండీ రాజీవ్ చాబా మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాలకు అనువైన రీతిలో కామెట్ ఈవీ కారును రూపొందించామన్నారు. ఈ కారుకు అన్ని హంగులను కల్పించడంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. అంతేకాకుండా అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా కారు ధర, ఎకనామికల్ చార్జ్ విషయంలో కూడా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంజీ మోటార్ రీజనల్ మేనేజర్ పవన్ కుమార్, పీపీఎస్ సీఈఓ జి.నీరజ్, సేల్స్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బహిరంగసభను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

మన్సూరాబాద్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మే 7న జరిగే బీఎస్పీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు గుండెల ధర్మేంద్ర పిలుపునిచ్చారు. బీఎస్పీ ఎల్‌బీనగర్ అధ్యక్షుడు గువ్వల సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌ను ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతచారి విగ్రహాల వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి హాజరవుతారని చెప్పారు.కార్యక్రమంలో నాయకులు పి.లింగం, కాటేపాక రమేష్, జక్కా యాదగిరి, సంపత్, ప్రవీణ్, కట్ల కుమార్, వినయ్, జనిగే విష్ణు తదితరులు పాల్గొన్నారు.